భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 26.0
తణుకు : 31.0 - 26.0


ఉండి మండలం యండగండి చిన్నావ ప్రాంతంలోని మునిగిపోయిన చేలు చూపిస్తున్న కౌలు రైతులు

పరిస్థితి అగమ్యగోచరం

పశువులను పెంచడంతో 11 ఎకరాల వరి పొలం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాను. గత రబీ సీజన్ ధాన్యం సొమ్ములు నేటికీ పడలేదు. అప్పులు చేసీ ఖరీఫ్ సాగు ప్రారంభించా. ఎకరాకు రూ.11 వేలు చొప్పున రూ.లక్షా 20 వేల వరకూ పెట్టుబడి పెట్టాను. గత పంట తాలూకా అప్పులు, తాజాగా పంట సాగుకు చేసిన అప్పులతో నా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.
-ఖండెల్లి రమణ, నందమూరు

వరద వస్తే పూర్తిగా నష్టమే

దువ్వలో కౌలుకు వ్యవసాయం చేస్తాను. గ్రామంలో రెండు వేల ఎకరాలు పైబడి పొలాలు మునిగి పోయాయి. వరద వచ్చిన ప్రతిసారి పంట నష్టం వాటిల్లుతోంది. కాల్దరి, సూర్యారావుపాలెం వద్ద ఏటిగట్టును పటిష్టం చేయాలి. చాలా ఏళ్ల నుంచి కాలువలో పూడిక పనులు చేయడం లేదు.
-మైపాల నాగేశ్వరరావు..రైతు దువ్వ

కల్వర్టులకు మరమ్మతులు లేకనే..

ఎర్రకాల్వ పరిధిలో రైతులందరూ ఇబ్బందులు పడుతున్నారు. పొలాలకు సాగునీరు అందించే క్రమంలో ఉన్న కల్వర్టులు పూర్తిగా పాడవడం వల్లే ముంపునకు గురవుతున్నాయి. నీటి ప్రవాహం సక్రమంగా లేక పోవడం వల్ల పొలాలు మునిగి పోతున్నాయి. కల్వర్టులను బాగుచేయాలి.
-శిరిగిన శెట్టి వెంకటేశ్వరరావు, దువ్వ, రైతు

మళ్లీ నాట్లు వేయాల్సిందే

పొలాలు పూర్తిగా నీటిలో ఉన్నాయి. మండపాక, వరిఘేడు రోడ్డులోని మలుపు వద్ద పెద్ద తూరలు ఉండేవి. ఇపుడు తూరల స్థానంలో చిన్న కల్వర్టు నిర్మించారు. దీనివల్ల నీరు లాగడం లేదు. ప్రస్తుతం మళ్లీ నాట్లు వేసు కోవాల్సిందే.. అక్కడ జగనన్న కాలనీ రావడం వల్ల కూడా నీటి ప్రవాహం తగ్గిపోయింది.
- అనసూరి రామాంజనేయులు,మండపాక

రెండు ఎకరాలు తుడిచేసింది

రెండు ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. నాట్లు కూడా వేశాను. వర్షాల కారణంగా బోడ పాడు డ్రెయినేజీ నుంచి వర్షపు నీరు వెళ్లకపోవడంతో రెండు ఎకరాలు నీటమునిగాయి. వేసిన నాట్లు కూడా కుళ్లిపోయాయి. ఇప్పటికే సుమారు రూ.30 వేలు వరకూ అప్పుచేసి పెట్టుబడి పెట్టాను. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు.
- గెద్దా శివాజీ, కౌలురైతు, పరిమెళ్ళ

నారు కూడా దొరకదు

పది ఎకరాలు కౌలు వ్యవసాయం చేస్తున్నాను. రెండు, మూడు రోజుల్లోనే నాట్లు వేయాల్సి ఉండగా భారీ వర్షాలు కురవడంతో నారుమడి పూర్తిగా దెబ్బతింది. ప్రస్తుతం ఎక్కడా కూడా నారు దొరికే పరిస్థితి లేదు. ఎకరానికి రూ. 2,500 నష్టం వాటిల్లుతుంది. పంటపొలాలు మునగకుండా చేయాలంటే తాడేరు డ్రెయిన్‌లో పూర్తి స్థాయిలో తూడు, గుర్రపుడెక్క తొలగించి మురుగు బోదె శుభ్రం చేయాలి.
-నెక్కంటి భాస్కరరావు, రైతు, ఆచంట
- నిమ్మకాయల గంగరాజు, పెనుమంచిలి

ముంపులోనే..



నవాబుపాలెం వద్ద నీటిముంపులో వరి చేలు

37,182 ఎకరాల్లో వరి నారుమళ్లు, నాట్లు మునక

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

కాలువలు పొంగి పొర్లుతున్నాయి. డ్రెయిన్లకు గండ్లు పడుతున్నాయి. పంటపొలాలు ఇంకా ముంపు లోనే ఉన్నాయి. వర్షం తెరిపి ఇచ్చినా సరే రైతుల మోములో ఆనందం లేదు. ఖరీఫ్ సాగు దెబ్బ తిందన్న బాధ అన్నదాతను వెంటాడుతోంది. మరోవైపు పెరుగుతున్న గోదావరి తీర ప్రాంతవాసులను, లంకగ్రామ ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. ఎర్ర కాలువ ఉధృతి కొనసాగుతోంది. ఆరుళ్ల వద్ద ఎర్రకాలువకు గండి పడింది. పెంటపాడు మండలంలో పలు గ్రామాల ముంపు భయం వెంటాడుతోంది. యనమ దుర్రు డ్రెయిన్ ఉధృతంగా ప్రవహించడంతో పరిసర ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. యనమదుర్రులో కలిసే డ్రెయిన్‌లు ఎదగదనుతున్నాయి. భీమవరం పట్టణంలో లోతట్టు ప్రాంతాలకు నీరు చేరింది. జిల్లాలో సుమారుగా 40 వేల ఎకరాల్లో వరినాట్లు ముంపుబారిన పడ్డాయి. కొత్తగా మళ్లీ సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ముంపు వదిలితే నారుమళ్లు వేసుకోవాలి. తక్కువ వ్యవధిలో దిగుబడి ఇచ్చే రకాలను ఇప్పటికే అధికారులు సిద్ధం చేశారు. మరోవైపు మూడు వేల ఎకరాల్లో వరినారుమడులు దెబ్బతిన్నాయి. దాదాపు 10 వేల ఎకరాల విస్తీర్ణంలో నారుమడులున్నాయి. అందులో మూడో వంతు వర్షాలు, వరదలకు దెబ్బతిన్నాయి. రకాలు వేసుకుంటే రబీకి మళ్లీ సిద్ధం కావచ్చంటూ అధికారులు రైతులకు సూచనలు చేస్తున్నారు.

భయపెడుతున్న గోదావరి

గోదావరిలో వరద ప్రవాహం పెరుగుతోంది. యలమంచిలి మండలం కానకాయలంక కాజ్‌వేపై గోదా వరి ప్రవాహం కొనసాగుతోంది. విజ్జేశ్వరం వద్ద ఒకటో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మూడో ప్రమాద హెచ్చరిక జారీచేస్తే గోదావరి లంకలు ముంపు బారిన పడనున్నాయి. అయితే అంత మేర వరద వచ్చే అవకాశం లేదని అధికారులు అంచనా వేస్తున్నారు. యలమంచిలి, ఆచంట మండలాల్లో రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు లంకగ్రామాల స్థితిగతులపై ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు.

జిల్లాలో పర్యటించిన కలెక్టర్

కలెక్టర్ నాగరాణి ముంపు ప్రాంతాలను పర్యటించారు. అధికారులు సూచనలు చేశారు. అవసరమైతే గోదావరి లంక ప్రజలకు పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు కోళ్ల నాగేశ్వరరావు తదితరులు వరద బాధితులకు ఆహార పొట్లాలను అందించారు. పెంటపాడులో నియోజవర్గ ఇన్‌ఛార్జ్ వలవల బాబ్జి ముంపు ప్రాంతాలను సందర్శించి బాధితులను పరామర్శించారు.

గోదావరి ఉధృతి.. శాంతించని ఎర్రకాలువ

ఎక్కడికక్కడ గండ్లు.. పల్లపు ప్రాంతాల్లో వరద నీరు


దువ్వ సమీపంలో పంటకాల్వకు గండిపడి చేలల్లోకి నీరు వెళుతున్న దృశ్యం

గోదావరి ఉగ్రరూపం

లంక గ్రామాల్లో వరద నీరు

పెనుగొండ/ఆచంట/నరసాపురం రూరల్, జూలై 22 : గోదారమ్మ సోమవారం మరింత ఉగ్రరూపం దాల్చడంతో ప్రవాహం మరింత పెరిగింది. ఆచంట మండలంలోని పుష్కర ఘాట్‌లు పూర్తిగా నీట మునిగాయి. మాచేనమ్మ ఆలయానికి చేరువులో వరద నీరు ఉంది. మరో రెండు, మూడడుగులు గోదావరి పెరిగితే లంకగ్రామాల్లో పల్లపు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగే అవకాశం ఉంది. నాటు పడవలపై రాకపోకలు నిషేదించారు. ఏటిగట్టు అనేకచోట్ల బలహీనంగా ఉండటంతో ఇసుక బస్తాలు సిద్ధం చేయాలని తీర ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఎగువ నుంచి భారీగా వరద నీరు రావడంతో పెనుగొండ మండలం సిద్ధాంతం, వశిష్ట గోదావరి వద్ద గోదావరి ఉప్పొంది ప్రవహిస్తున్నది. సోమవారం దొంగరావిపాలెం, సిద్ధాంతం, నడిపూడి, చినమల్లం లంక భూములను తాకుతూ నిండుగా గోదావరి ప్రవహిస్తోంది. సిద్ధాంతం కేదార్‌ఘాట్ వద్ద మెట్లు పూర్తిగా మునిగి మంగళవారం ఉదయానికే పైకి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

రెండో రోజు రాకపోకలు బంద్

మాధవాయిపాలెం-సఖినేటిపల్లి రేవుల మధ్య రెండో రోజు సోమవారం పంటు రాకపోకల్ని నిలుపుదల చేశారు. ఎగువ ప్రాంతం నుంచి లక్షల క్యూసెక్కుల వరద నీరు పోటెత్తడంతో నరసాపురం రేవుల్లో గంట గంటకు నీటి మట్టాలు పెరుగుతున్నాయి. మరో రెండు రోజులు ఇదే విధంగా కొనసాగ వచ్చన్న హెచ్చరికతో అధికారులు అప్రమత్త మయ్యారు. పట్టణ, మండలంలోని స్లూయిస్‌లను మూసివేశారు. గోదావరిలో వేటను అనుమతించడం లేదు. బాపు, వలంధర్ రేవుల వద్ద వరద నీరు మెట్ల వరకు చేరింది. దీంతో రేవుల్లోకి ఎవర్నీ అనుమతించడం లేదు. పిండప్రధానాలు చేసేందుకు వచ్చిన వారు కూడా బయటే స్నానాలు చేయాల్సి వచ్చింది.


నరసాపురం వలంధర్ రేవు వద్ద గోదావరి వరద ఉధృతి


మోగల్లు శివారు గుత్తులవారిపాలెంలో బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

నష్టం అంచనాలు..

వివరాలు వెల్లడించిన కలెక్టర్

భీమవరం టౌన్, జూలై 22 : నాలుగు రోజులుగా కురిసిన వర్షాలు, వరదల కారణంగా జిల్లాలోని ఏడు మండలాల్లోని 43 గ్రామాలు ముంపు బారిన పడ్డాయని కలెక్టర్ చదలవాడ నాగరాణి వివరించారు. ఎనిమిది గ్రామాల్లోకి వరద నీరు చొచ్చుకు వచ్చిందని, మూడు పట్టణ ప్రాంతాలు వరద తాకిడి గురి కాగా, భీమ వరం పట్టణంలోని కొన్ని ప్రాంతాలు జలమయమయ్యాయి. 20 మండలాల్లోని 37,182 ఎకరాల్లో వరి నారుమళ్లు, నాట్లు దెబ్బతిన్నాయని సుమారు రూ.41.52 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పంట నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ రూ.41.51 కోట్ల అవసరం అన్నారు. 614 మంది రైతులు సాగు చేస్తున్న ఉద్యానవన పంటలు 154.46 హెక్టార్లు ముంపునకు గురవగా సుమారు రూ.4.06 కోట్ల మేర నష్టం వాటిల్లుతుందని అంచనా. ఉద్యానవన పంటలకు రూ.4.05 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అవసరం అన్నారు. వరదలకు 14 గృహాలు దెబ్బతినగా వాటిలో రెండు పూర్తిగాను, ఒకటి తీవ్రంగా దెబ్బతిన్నాయి.ఏడు గృహాలు పాక్షికంగా, నాలుగు గుడిసెలు దెబ్బతిన్నాయి. 66 ఆర్అండ్‌బీ రహదారులు దెబ్బతినగా వాటిలో 179.820 కిలోమీటర్ల మేర రోడ్లు గోతులు పడి దెబ్బతిన్నాయి. వీటి తాత్కాలిక మరమ్మతులకు రూ12.88 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ1.30 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. 274.27 కిలోమీటర్ల పరిధిలోని 105 పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతిన్నాయి. వీటి తాత్కాలిక మరమ్మతులకు రూ.కోటీ 30 లక్షలు, శాశ్వత రోడ్ల ఏర్పాటుకు 85.70 కోట్ల రూపాయలు అంచనా వ్యయం అవుతుందని కలెక్టర్ వివరించారు.


మాధవరం-జగన్నాథపురం రోడ్డుపై వరదనీరు

విరుచుకుపడిన ఎర్రకాల్వ

తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు/ తణుకు, జూలై 22: ఎర్రకాలువ వరద ఎగువ దిగువ ప్రాంతాల్లో రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఎర్రకాలువ దిగువ ప్రాంతానికి చేరుకునే సరికి యనమదుర్రు డ్రెయిన్‌గా మారుతుంది. వేలాది ఎకరాలు ఎర్రకాలువ ముంపులోనే ఉన్నాయి. ఆరుళ్ల వద్ద పడిన గండి పెంటపాడు మండలంలో ప్రభావం చూపనుంది. మంగళవారం నాటికి దిగువ ప్రాంతానికి ఎర్రకాలువ వరద చేరు కోనుంది. ముంపు తీవ్రత అధికం కానుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగో రోజు వరిపంట నీటిలోనే నానుతోంది. మండలంలోని నందమూరు,ఆరుళ్ల, మారంపల్లి, మాధవరం, జగన్నాథపురం, అప్పారావుపేట, పట్టింపాలెం, వీరంపాలెం గ్రామాల్లో వందలాది ఎకరాలు ముంపులోనే ఉన్నాయి. దీంతో ఎకరాకు రూ.11 వేల వరకూ రైతులు నష్టపోయారు. వీటికి తోడు వర్షాలకు మురుగు బయటకు వెళ్లలేని పరిస్థితుల్లో నవాబుపాలెం, ఆరుగొలను, కొత్తూరు, మోదుగగుంట, తదితర గ్రామాల్లో వరదనీటితో పంట నీటితో మునిగిపోయింది. ఆరుళ్ల వద్ద పడిన గండి వల్ల ఆరుళ్ల, కోనాల రోడ్డు మొత్తం రాకపోకలు నిలిచి పోయాయి. వందలాది ఎకరాలు నీటితో మునిగిపోయాయి. ఎంపీడీవో ఎస్ఎస్ శర్మ, తహసీల్దార్ మురళి కృష్ణలు సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు. పెంటపాడు మండలంలో వేలాది ఎకరాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. డ్రెయిన్లు పూడుకుపోయి వర్షపు నీరు బయటకు వెళ్లేమార్గం లేక పోవడంతో ముంపులోనే చేలు ఉన్నాయి. పరిమెళ్ళ చినకాపవరం కాల్వ ఉద్రిక్తంగా ప్రవహిస్తోంది. గట్టులకు గండి పడే ప్రమాదం ఉండటంతో రైతులు, స్థానికులు ముందస్తుగా ఇసుకబస్తాలు అమర్చుకున్నారు. అయినా కాలువ ప్రమాదకరంగా ప్రవహిస్తుండంటతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెరువుల్లా చేలు

తణుకు మండలం ముద్దాపురం, కోనాల, దువ్వ, తేతలి, మండపాక గ్రామాల పొలాలను ఎర్రకాల్వ వరద ముంచేసింది. మండపాక, దువ్వ గ్రామాల్లో నాట్లు వేసిన పొలాలు పూర్తిగా నీటిలోనే ఉండటంతో కుళ్ళిపోయాయని కొత్తగా నాట్లు వేసుకోవాలని రైతులు చెబుతున్నారు. ఉండ్రాజవరం మండలం సూర్యారావు పాలెం సమీపంలోని ఏటి గట్టు పైనుంచి వరదనీరు ప్రవాహం రావడంతో ముద్దాపురం, దువ్వ గ్రామాలకు చెందిన పొలాలు పూర్తిగా నీట మునిగాయి. దువ్వ నుంచి సూర్యారావు పాలెం వెళ్లే రోడ్డు పైనుంచి వరద నీరు ప్రవహిస్తున్నది. రెండు గ్రామాల మధ్య రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దువ్వ అక్విడెక్టు సామర్థ్యం 18 అడుగులు ఉండగా 15.7 అడుగులకు వరద నీరు ప్రవహిస్తున్నది. కాలువ సమీపం లోని దువ్వ మాచారమ్మ ఆలయం, దళితపేట, తూర్పుగూడెం ప్రాంతాల్లో నివాస ప్రాతాలకు వరద నీరు చేరింది. మండలంలోని కోనాల, ముద్దాపురం, దువ్వ, మండపాక, తేతలి గ్రామాల పరిధిలోని 3,040 ఎకరాల్లో వరిపంట నీట మునిగింది.


పెదమల్లం మాచేనమ్మ ఆలయం గట్టుకు చేరిన వరద


సిద్ధాంతం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి


పరిమెళ్ల చినకాపవరం కాలువ గట్టుకు గండి పడకుండా ఇసుకబస్తాలు వేసుకుంటున్న రైతులు, స్థానికులు



నందమూరు అక్విడెక్టు వద్ద ఉధృతి


వయ్యేరు కాలువ సమీపంలో రహదారి జలమయం



జనసేన పార్టీ కోశాధికారిగా అంజిబాబు

భీమవరం టౌన్, జూలై 22 : జనసేన పార్టీ రాష్ట్ర కోశాధికారిగా భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను నియమించినట్టు ఆ పార్టీ రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ ప్రకటించారు. అంజిబాబుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.



గంజాయ్

దారి తప్పుతున్న యువత
మత్తులో దాడులు..చోరీలు..
పట్టించుకోని పోలీసులు
నూజివీడులో జోరు 7

నిర్మలమ్మ మురిపిస్తారా



నేడు కేంద్ర బడ్జెట్

ఉద్యోగులకు ఆదాయ పన్ను పెరిగేనా.. ?
వాహనాలు, పసిడిపై పన్నులు తగ్గేనా ?
కోటిపల్లికి ఈసారి ఎన్ని కోట్లో.. ?
పెండింగ్ రైళ్లు పట్టాలెక్కేవి ఎన్నో ?
రైతులకు మద్దతు ధర, ఎరువుల సబ్సిడీపై ఆశలు

నరసాపురం, జూలై 22 : సార్వత్రిక ఎన్నికలు-24 తర్వాత కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ మంగళవారం తొలిసారిగా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతోంది. కేంద్ర ఆర్థిక, రైల్వే శాఖల మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బడ్జెట్‌లో జిల్లాకు ఎలాంటి వరాలు కురిపిస్తారోనని సామాన్య మధ్య తరగతితోపాటు రైతులు, శ్రమ జీవులు కోటి ఆశలు పెట్టుకున్నారు. ప్రతిపాదనలో వున్న కొత్త రైళ్లు, కోటిపల్లి రైల్వే లైన్, దిగమర్రు-ఆకివీడు 165 జాతీయ రహదారి పనులకు నిధులు, ధాన్యానికి గిట్టుబాటు ధర, ఎరువులపై సబ్సిడీ వంటి ఎన్నో అంశాలపై ఆయా వర్గాలు ఎదురు చూస్తున్నాయి.

కోటిపల్లి బడ్జెట్‌పై ఆశలు

పెండింగ్‌లో వున్న రైల్వే ప్రాజెక్టుల్లో కోటిపల్లి రైల్వే లైన్ ఒకటి. ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు కేంద్రం రూ.400 కోట్లు కేటాయించింది. ఎన్నికల్లో ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేస్తామని కూటమి పార్టీలు హామీలిచ్చాయి. దీంతో ఏ మేరకు నిధులు ఇస్తారన్నది ఉత్కంఠంగా మారింది. ఇప్పటికే వంతెన నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయి. భూసేకరణ పెండింగ్‌లో ఉంది. ఈ పనులు వేగవంతం కావాలంటే నిధులు కేటాయించాలి. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు పెద్ద మొత్తంలోనే నిధులు ఇస్తారన్న వాదనలు వినిపిస్తున్నాయి. నరసాపురం నుంచి చాలా రైళ్లు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. వీటిలో బెంగళూరు, వారాణసి, చెన్నై, రైళ్లు ఉన్నాయి. కనీసం ఒక్క రైలుకైనా పచ్చ జెండా ఊపుతారని జిల్లావాసులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

రైతుల ఎదురుచూపు

ఎన్నికల సమయంలో రైతులకు అండగా ఉంటామని ఎన్డీఏ ప్రకటించింది. దీనికనుగుణంగా బడ్జెట్‌లో పెద్ద పీట వేస్తుందని వారు ఆశ పెట్టుకున్నారు. ధాన్యానికి ఉన్న గిట్టుబాటు ధరను రూ.2,200కు పెంచడంతోపాటు కాంప్లెక్స్ ఎరువుల బస్తా ధరను రూ.1,800 నుంచి తగ్గిస్తారని ఎదురుచూస్తున్నారు. పొగాకు, పసుపు రైతులు ఇదే నమ్మకంతో ఉన్నారు.

ఆదాయపన్ను పరిమితి పెరిగేనా ?

ఈ ఏడాది మధ్యంతర బడ్జెట్‌లో ఆదాయ పన్ను మినహాయింపు తూతూ మంత్రంగా జరిగింది. రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచారు. కొన్నేళ్ళ నుంచి పన్నుదారులకు కేంద్రం ఎలాంటి వరం ఇవ్వడం లేదు. ఈ సారి ఆదాయ పరిమితిని రూ.5 లక్షలకు పెంచుతారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉద్యోగులు, పన్నుదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

పసిడి ధర దిగేనా ?

ప్రస్తుతం పసిడి ధర సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో లేదు, రోజు రోజుకు పెరుగుతోంది. ప్రస్తుతం బంగారం దిగుమతిపై 12 శాతం కస్టమ్స్ డ్యూటీ ఉంది, ఇది కాకుండా 3 శాతం జీఎస్టీ అమలవుతుంది. వీటిని తగ్గిస్తే ధర దిగే అవకాశం ఉంది. బడ్జెట్‌లో పన్ను మినహాయింపు ఉంటుందన్న ఆశ వ్యాపారులతో పాటు ప్రజల్లో ఉంది.

జాతీయ రహదార్లకు మోక్షం కలిగేలా ?

జిల్లాలో 216 జాతీయ రహదారితోపాటు పాలకొల్లు మండలం దిగమర్రు నుంచి కృష్ణా జిల్లా పామర్రు వరకు కొత్తగా 165 జాతీయ రహదారిని నాలుగు లైన్లగా విస్తరిస్తున్నారు. ఇప్పటికే ఆకివీడు-పామర్రు మధ్య పనులు మొదలయ్యాయి. మూడేళ్లుగా దిగమర్రు-ఆకివీడు మధ్య పనులు పెండింగ్ పడ్డాయి. ఈ పనులకు నిధులు కేటాయించాలని ఎన్‌హెచ్ అధికారులు కేంద్రానికి నివేదించారు. రూ.1,500 కోట్లు అంచనా అయ్యే ఈ ప్రాజెక్టుకు ఏ మేరకు నిధులు కేటాయిస్తారో వేచిచూడాలి.

వాహన పన్ను తగ్గేనా..?

జిల్లాలో కార్లు, బైక్‌ల అమ్మకాలు ఏటా పెరుగుతున్నాయి. బడ్జెట్‌లో ఈ సారి పన్ను తగ్గిస్తారన్న ఆశతో చాలా మంది ఎదురు చూస్తున్నారు. రెండేళ్ళ నుంచి ఎలక్ట్రానిక్ వాహనాలకు వినియోగం బాగా పెరిగింది. గతంలో వీటి సబ్సిడీని ఎత్తివేసింది. బడ్జెట్‌లో మళ్లీ వీటి కొనుగోళ్ళపై రాయితీ ఇస్తారన్న ఆశ వాహనదారుల్లో నెలకొంది.


బాధితుల గోడు వింటున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

సత్వర న్యాయం అందించండి : ఎస్పీ

భీమవరం క్రైం, జూలై 22 : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన అర్జీదారులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి నేరుగా పది ఫిర్యాదులు స్వీకరించారు. ముఖాముఖీ మాట్లాడారు. వారి సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కుటుంబ కలహాలు, భర్త, అత్తింటి వేధింపులు, భూ వివాదాలు, ఉద్యోగం అంటూ మోసాలు, ఇతర అంశాలపై ఫిర్యాదులు అందాయన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్‌లో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఆ ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం అందిస్తామని ఎస్పీ తెలిపారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు


స్టాక్ గొడౌన్‌లో స్టాక్ పరిశీలిస్తున్న డీఎస్ఓ రాజు

వేలేరుపాడు, జూలై 22: వరద బాధితులకు పంపిణీ చేసేందుకు 30 టన్నుల బియ్యం, ఎనిమిది టన్నుల ఉల్లిపాయలు, కూర గాయాలు, 500 టార్పా లిన్లు అందుబాటులో ఉంచామని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్ఎస్ ఎస్‌రాజు తెలిపారు. బాధితుల కోసం సిద్ధం సరుకుల ఎగుమతిని డీఎస్ఓ సోమవారం పర్యవేక్షించారు. వరద సహాయక కేంద్రాలకు రాలేని పరిస్థితుల్లో ఉన్న బాధిత కుటుంబాలకు మూడు రోజులకు సరిపడ ఐదు కిలోల బియ్యం, అర కేజీ కందిపప్పు, అర కేజీ నూనె, ఐదు రకాల కూరగాయాలు ఒక్కొక్కటి కేజీ చొప్పున ప్రతి ఇంటికి పంపిణీ చేసేందుకు సిద్ధం చేసి, ఆయా గ్రామాలకు తరలించామని తెలిపారు. డీఎస్ఓతో పాటు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ భాష, డీపీఓ తూతిగ శ్రీనివాసవిశ్వనాథ్ ఉన్నారు.

వరద విపత్తులో సురక్షిత ప్రసవం


జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రిలో ప్రసవించిన గిరిజన మహిళ

కుక్కునూరు, జూలై 22 : భారీ వర్షాలు, వరదల కారణంగా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 28 మంది గర్భిణులను జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలోనూ, పీహెచ్‌సీలో చేర్పించారు. ఈ క్రమంలో కుక్కునూరు మండలం చీపురుగూడెంకి చెందిన సోడెం అనీత, మడకం దేవమ్మ, పుల్లపుగూడెం గ్రామానికి చెందిన బి.అరుణలను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రెండు రోజుల వ్యవధిలో ముగ్గురు పండంటి బిడ్డలకు జన్మనిచ్చారు. వరదను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా వారిని ఆస్పత్రిలో చేర్చడంతో ఎటువంటి ఇబ్బంది లేకుండా వైద్యుల పర్యవేక్షణలో సుఖ ప్రసవాలు పొందారని ఆ కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏరియా ఆస్పత్రిలో ముంపు ప్రాంతాల గర్భిణులు


ముంపు ప్రాంతాల నుంచి తీసుకు వచ్చిన గర్భిణులు

జంగారెడ్డిగూడెం, జూలై 22 : వరద ప్రాంతాలైన వేలేరుపాడు, కుక్కునూరు మండలలాలకు చెందిన 19 మంది గర్భిణులను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు సోమవారం జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. సూపరిండెంటెంట్ డాక్టర్ బేబి కమల ఆధ్వర్యంలో వారికి పరీక్షలు నిర్వహించి, వైద్యం అందించారు. వారిలో కొంత మందికి రక్త శాతం తక్కువగా ఉందని గుర్తించి దాతలను సంప్రదించారు. గర్భిణులకు రక్తం అవసరమని ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు వీపీఎస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పాలడుగుల సురేష్ స్పందించి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేశారు. దీంతో ఎంతో మంది యువకులు స్పందించి తనను సంప్రదించగా వారిలో 20 మంది వద్ద ఏరియా ఆసుపత్రి సిబ్బంది రక్తాన్ని సేకరించారు. యువకులతోపాటు పట్టణానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ జెట్టి భీమశేఖర్ కూడా రక్తదానం చేయడంతో ఆయనను పలువురు అభినందించారు.

ట్రిపుల్ ఐటీలో తొలి రోజు 436 మందికి ప్రవేశాలు


లిఖితకు తొలి అడ్మిషన్ కార్డు అందజేస్తున్న చంద్రశేఖర్

నూజివీడు టౌన్, జూలై 22: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జనరల్ కౌన్సెలింగ్ ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. తొలిరోజు 515 మందికి కాల్ లెటర్లు పంపగా 436 మంది ప్రవేశాలు పొందారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా రెండు రిజిస్ట్రేషన్ కౌంటర్లు, నాలుగు అకడమిక్ వెరిఫికేషన్, మూడు ఫీజు, డేటా ఎంట్రీకి సంబంధించి ఏడు, సర్టిఫికెట్ కలెక్షన్స్‌కు నాలుగు, ఐడీ కార్డు ఇష్యూ కౌంటర్లుమూడు ఏర్పాటు చేశారు. శాక్ బిల్డింగ్‌లో అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు చేయగా నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్, అడ్మిషన్స్ కన్వీనర్ అమరేంద్ర కుమార్ తొలి రోజు ప్రవేశాల ప్రక్రియను పర్యవేక్షించారు. పదో తరగతిలో 597 మార్కులు సాధించి ఆర్‌జీయుకేటీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న తిరుపతి జిల్లా కొత్త వేపకుప్పంకు చెందిన పి.లిఖితకు తొలి అడ్మిషన్ ఇస్తూ డైరెక్టర్ చంద్రశేఖర్, అమరేంద్ర కుమార్ ఐడీ కార్డును అందజేశారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ పొడిగింపు

ఏలూరు అర్బన్, జూలై 22 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యాన్ని వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసిందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు, డీపీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఇప్పటికే అమలవుతున్న ఈహెచ్ఎస్ పథకానికి సమాంతరంగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ కొనసాగుతుందన్నారు.

'పది' పరీక్షార్థుల మాధ్యమంపై స్పష్టత ఇవ్వాలి

పదో తరగతి విద్యార్థులందరూ తప్పనిసరిగా ఆంగ్ల మాధ్యమంలోనే పబ్లిక్ పరీక్షలు రాయాలంటూ గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన నిబంధనను కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సడలించాలని అంజనేయులు డిమాండ్ చేశారు. ఆ మేరకు మాధ్యమం ఎంపికను విద్యార్థి అభీష్టానికే వదిలేయాలన్నారు. దీంతోపాటు హైస్కూళ్లలో ఆంగ్లంతోపాటే, తెలుగు కూడా సమాంతరంగా ప్రవేశపెట్టాలని, ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో నుంచి ఐదో తరగతి వరకు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికనుగుణంగా జీవో 117 ఉత్తర్వులను రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో లోపాలను సరిదిద్దడంతోపాటు, టోఫెల్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

పీఎఫ్ చెల్లింపు.. సమ్మె విరమణ

ఏలూరు క్రైం, జూలై 22 : జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు థర్డ్ పార్టీ కాంట్రాక్టర్ పీఎఫ్ చెల్లించడంతో ఈ నెల 22న తలపెట్టిన సమ్మెను విరమించారు. కాంట్రాక్టర్ వెంటనే ఆ సొమ్ము చెల్లించడంతో సమ్మె విరమించినట్లు జిల్లా అధ్యక్షుడు పి కృష్ణమాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

పునరావాస కేంద్రాలకు


నాటు పడవ పై తిరుమలాపురం వెళ్తున్న కలెక్టర్, ఎస్పీ

కుక్కునూరు, వేలేరుపాడు వరద బాధితుల తరలింపు

- వరద ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ సుడిగాలి పర్యటన
- చాగరపల్లి గ్రామానికి నాటుపడవ పై వెళ్లి పరామర్శ
- నిత్యావసర సరుకులు అందజేత

వేలేరుపాడు/కుక్కునూరు, జూలై 22: గోదావరి వరద చుట్టుముట్టిన వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ సుడిగాలి పర్యటన చేశారు. వరద చుట్టుముట్టిన రేపాకగొమ్ము, తిరుమలాపురం, చాగరపల్లి గ్రామాలకు వెళ్లి వరద క్రమేపి పెరుగుతున్నందున తక్షణమే గ్రామాలను ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. అప్పటికప్పుడు సహాయ చర్యలు చేపట్టాలంటే కష్టమవుతుందని దీని వలన ప్రజలకు, అధికారులకు కూడా ఇబ్బందిగా ఉంటుందని, గ్రామాలు ఖాళీ చేయాలని కలెక్టర్ కోరారు. వరద ఉధృతి తగ్గేంత వరకు పునరావాస కేంద్రాల్లో ఉండాలని, ప్రజలకు ఎటువంటి నష్టం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. కలెక్టర్ విజ్ఞప్తికి చాగరపల్లి గ్రామస్థులు స్పందించారు. ఈ గ్రామంలోని ప్రజలను దాచారంలోని ఆర్ అండ్‌ఆర్ కాలనీకి తరలించే ఏర్పాట్లు అధికారులు ప్రారంభించారు. కన్నాయగుట్ట అంగన్వాడీ కేంద్రంలో నిత్యావసర వస్తువుల స్టాక్ పాయింట్‌ను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. వరద కారణంగా రహదారి సౌకర్యంలేని గ్రామాలకు మూడు రోజులకు సరిపడ ఐదు కిలోల బియ్యం, అరకేజీ కందిపప్పు, అరకేజీ వంట నూనె, ఐదు రకాల కూరగాయలు కేజీ చొప్పున, నిత్యావసర సరుకులను ప్రతీ ఇంటికి వాటర్ ప్యాకెట్ల బస్తాను అందజేస్తున్నామని తెలిపారు. కలెక్టర్, ఎస్పీ ఆదివారం సాయంత్రం నుంచి వేలేరుపాడులో మకాంచేసి వరద పరిస్థితి పై ఆరాతీస్తూ తీసుకోవాల్సిన సహాయక చర్యలపై అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. వరద చుట్టుముట్టిన గ్రామాలకు వైద్య సిబ్బందిని పడవల ద్వారా పంపించారు. గ్రామాల్లోని ప్రజలను తరలించే బాధ్యతలను స్థానిక అధికారులకు, బయట ప్రాంతాల నుంచి రప్పించిన గ్రామ కార్యదర్శులకు అప్పగించారు. సోమవారం ఉదయం నుంచి కలెక్టర్, ఎస్పీలు వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. దీంతో జిల్లా అధికార యంత్రాంగం మొత్తం ఇక్కడే దృష్టి కేంద్రీకరించింది.

30 బోట్లు, హెలికాప్టర్ సిద్ధం : కలెక్టర్

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఐదు కేంద్ర, రాష్ట్ర విపత్తు నివారణ బృం దాలు, 30 బోట్లు, అత్యవసర పరిస్థితుల్లో వినియోగించటానికి హెలికాప్టర్లు రాజమండ్రిలో సిద్ధంగా ఉంచామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలలో కలెక్టర్ సోమవారం పర్యటించి దాచారం పునరావాస కాలనీని సందర్శిం చారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో వరద పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని, ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. ముంపునకు గురైన గ్రామాలలో రహదారి సౌకర్యం దెబ్బతిన్న కారణంగా బోటులో వెళ్లి అక్కడ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని తెలిపారు. వరద సహాయక కేంద్రాల్లో వరద బాధితులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. ప్రతి గ్రామానికి ప్రత్యేకాధికా రులను నియమించామని, బాధితులు పూర్తి స్థాయిలో సహకరిస్తే ఎటు వంటి సమస్యలు తలెత్తవని అన్నారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్‌శివకిశోర్ మాట్లాడుతూ మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు సమాచార వ్యవస్థకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టామన్నారు.

ఏం పెద్దాయనా..
వసతులు బాగున్నాయా

'ఏం పెద్దాయనా ఎలా ఉన్నారు... వసతులు బాగున్నాయా... మీ గ్రామంలో ఎవరైన పునరావాస కేంద్రానికి రాని వారు ఉంటే వారిని తీసుకురండి'.. అంటూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి దాచారం పునరావాస కాలనీలో గొమ్ముగూడెం గ్రామానికి చెందిన సత్యం (70)తో మాట్లాడిన తీరు అందరిని ఆకట్టుకుంది. వరద బాధితులను ఆదుకునేందుకు కలెక్టర్ వెట్రిసెల్వి నిర్వాసితులతో మాటా మంతి కలుపుతూ వారి ఇబ్బందులను తెలుసుకుంటున్నారు. ఆదివారం గోదావరి పెరుగుతుందన్న సమాచారం తెలుసుకున్న కలెక్టర్ వేలేరుపా డు మండలానికి వచ్చి అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. మరలా సోమవారం వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో బాధితులను కలిసి ఇంకా ఏమైనా సహాయం అందించాలా అని అడిగి అధికారులతో చర్చించి పరిష్కరిస్తున్నారు. నిండు గోదావరిలో బోటుపై ప్రయాణిస్తూ రహదారి సౌకర్యం లేని గ్రామాలను సందర్శిస్తున్నారు. బాధితులను ఆదుకునేందుకు కలెక్టర్ తనదైన శైలిలో విధులు నిర్వహించడంపై వరద బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కుక్కునూరు మండల దాచారం పునరావాస కాలనీలో నిర్వాసితులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

బాధితులకు మెరుగైన వైద్యం అందించండి : జేసీ

కుక్కునూరు, జూలై 22 :గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో మెరుగైన వైద్యాన్ని అందుబాటులో ఉంచేందుకు పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి తెలిపారు. దాచారం పునరావాస కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సోమవారం జేసీ సందర్శించారు. వైద్య శిబిరంలో అందజేస్తున్న మందులను ఆమె పరిశీలించారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలందించాలని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలందించాలన్నారు.


కుక్కునూరు మండలం దాచారం పునరావాస కాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జేసీ లావణ్యవేణి

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెదవేగి, జూలై 22: పెదవేగి జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్వీ)లో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. అభ్యర్థులు 2013 మే 1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించి, 2024-25 విద్యా సంవత్సరంలో ఉమ్మడి పశ్చిమ గోదావరిలో చదువుతూ ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదో తరగతి చదువుతూ ఉండాలి. అర్హత కలిగిన విద్యార్థులు https://navodaya.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా సెప్టెంబరు 16 లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 18న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

క్రైం కార్నర్

హుండీ పగులగొట్టి...

ద్వారకాతిరుమల, జూలై 22: శ్రీవారి క్షేత్ర ఆళ్వార్ సదనం సమీపంలో ఉన్న శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో దొంగలు పడ్డారు. ఆలయంలో ఉన్న హుండీని పగలకొట్టి అందులోని నగదును దొంగిలించారు. ఏటా శరన్నవ రాత్రులకు ముందు రోజుల్లో ఇక్కడి హుండీని తెరచి లెక్కిస్తారు. దాదాపు ఏడు నెలలుగా తెరవని ఈ హుండీలో దాదాపు రూ.40 వేలు పైబడి నగదు ఉండవచ్చని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు ద్వారకా తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. తెలిసిన వారే ఈ చోరీకి పాల్పడి ఉండవచ్చన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

నూజివీడు, జూలై 22: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. రామన్నగూడెంకు చెందిన శీలం వెంకటేశ్వరరావు 2020 ఫిబ్రవరిలో విజయవాడకు చెందిన కరికేటి పాల్ తిమోతికి రూ.ఏడు లక్షలు అప్పుగా ఇవ్వగా, బాకీ తీర్చే నిమిత్తం రూ.7.5 లక్షల కు 2021 మార్చిలో చెక్కులు ఇచ్చాడు. అయితే ఆ చెక్కులు బౌన్స్ కావడంతో బాధితుడు కోర్టును ఆశ్రయించగా నిందితుడు తిమోతికి ఆరు మాసాల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు చెప్పారు.

వ్యవసాయ కేబుల్ వైర్లు చోరీ

ద్వారకాతిరుమల, జూలై 22 :వర్షాలు కురుస్తుండటాన్ని అదనుగా చూసు కుని కేటు గాళ్లు వ్యవసాయ కేబుల్ వైర్లను టార్గెట్ చేస్తున్నారు. రైతులు పొలా నికి రారన్న ధైర్యంతో దర్జాగా వైర్లను దొంగింలించి అమ్ముకుంటున్నారు. ఈ క్రమంలో రామన్నగూడెం పంచాయతీ దేవినేనివారిగూడెంలో దాదాపు 15 మంది రైతుల వ్యవసాయ బోర్ల విద్యుత్ వైర్లు చోరీకి గురయ్యాయి. వాటి విలువ సుమారు రూ. లక్షా 50 వేలు ఉంటుందని చెబుతున్నారు. వారంతా సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 40 నుంచి 50 మీటర్ల వైర్లను, 15 మంది రైతులకు చెందిన బోర్లు నుంచి ఈ నెల 20న చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలా తరచూ జరుగతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గోదారిలో జారిపడి ఒకరి మృతి


కుంజా వెంకయ్య (ఫైల్)

వేలేరుపాడు, జూలై 22: తూర్పుమెట్టకు చెంది న ఒక వ్యక్తి గోదావరి వరదను చూసేందుకు వెళ్లి జారిపడి మునిగి చనిపోయిన ఘటన సోమ వా రం ఉదయం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివ రాల ప్రకారం కుంజా వెంకయ్య (48) మరికొంత మందితో కలిసి గ్రామానికి అనుకుని ప్రవహి స్తు న్న గోదావరి నదిని చూసేందుకు వెళ్ళాడు. అయి తే ప్రమాదవశాత్తు బురదలో కాలుజారి పోవడం తో నదిలోపడి మునిగిపోయాడు. ఇది గమనించిన తోటివారు వెంటనే నదిలోకి దిగి గాలించగా అప్పటికే మృతి చెందిన వెంక య్య మృతదేహం లభ్యమైంది. వెంకయ్య మృతి చెందిన విషయాన్ని గ్రామ స్థులు స్థానిక అధికారులకు సమాచారం ఇచ్చారు.

ప్రమాదవశాత్తు గోదావరిలో పడిన వ్యక్తి

యలమంచిలి (పాలకొల్లు రూరల్), జూలై 22: యలమంచిలి లంక శివా రు చాకలిపాలెం గోదావరి నదిలో గ్రామానికి చెందిన పితాని ఆనంద్ కుమార్ అనే వ్యక్తి ప్రమాద వశాత్తు కాలు జారి పడిపోయాడు. అతని ఆచూకీ కోసం గ్రామస్తులు, అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.

యాసిడ్ తాగి మహిళ ఆత్మహత్య

భీమవరం క్రైం, జూలై 22 : బాత్ రూమ్‌కు వాడే యాసిడ్ తాగి ఒక మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. భీమవరం వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ అంబేడ్కర్ జిల్లా మామిడికుదురు మండలం జగ్గన్నపేటకు చెందిన జానా ఏసురాజు కొంత కాలం క్రితం ఉద్యోగం నిమిత్తం భీమవరం వచ్చి మెంటేవారి తోటలో నివాసముంటున్నారు. అతని తల్లి జానా అరుణావతి(57)కు మానసిక వ్యాధి ఉండడంతో అప్పడప్పుడు బయటకు వెళ్లి మతి స్థిమితం లేకుండా ఉంటుంది. ఆమెకు ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. సోమవారం ఉదయం అరుణావతి బాత్‌రూమ్ కడిగే యాసిడ్‌ను తాగేసింది. అది చూసిన కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు జానా ఏసురాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జూలై 22 : భార్యాభర్తల గొడవలు నేపథ్యంలో ఒక వ్యక్తి పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరులోని బీడీ కాలనీకి చెందిన పోలరౌతు వెంకట నాగ శ్రీనివాసరావు (45) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్య లావణ్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తాగి వచ్చి భార్యను కొడుతున్నారు. ఈ నేపథ్యంలో వారిద్దరి మధ్య గొడవలు జరిగాయి. శ్రీనివాసరావు ఈ నెల 21వ తేదీన పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతనిని ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందు తూ సోమవారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

పేకాటలో ముగ్గురి అరెస్ట్

ఏలూరు క్రైం, జూలై 22 : ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చాటపర్రులో సోమవారం సాయంత్రం పేకాట ఆడుతున్న ముగ్గురిని ఏలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,600లు స్వాధీనం చేసుకున్నారు.



నూజివీడులో జోరుగా గంజాయి విక్రయాలు

- మత్తులో దారి తప్పుతున్న యువత
- దొంగతనాలకు తెగబడుతున్న వైనం
- ఫిర్యాదులు పట్టించుకోని పోలీసులు

నూజివీడు పట్టణంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ యువతకు గంజాయి స్వేచ్ఛగా దొరుకుతుండడంతో ఈ వ్యసనానికి మరింత బానిసలవుతున్నారు. తాజాగా పట్టణంలోని బాపూనగర్‌లో కొందరు యువకులు, ఒక యువకుడిని ఫలానా వ్యక్తి నుంచి గంజాయి తీసుకురమ్మని కోరటం, దానికి ఆ యువకుడు తిరస్కరించడంతో ఆ యువకుడిపై వారు దాడి చేసి బ్లేడుతో గాయపరిచిన సంఘటన ఇటీవల జరిగిన సంగతి తెలిసిందే. పదిహేనేళ్ల నుంచి నూజివీడులో గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం ఎక్కువగానే ఉన్నా, మీడియాలో ఈ విషయం వెల్లడైనప్పుడు పోలీసులు అరికట్టడానికి కనీసం కంటితుడుపు చర్యలు చేపట్టేవారు. గత వైసీపీ పాలనలో పోలీసులు గంజాయిని అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. గంజాయిపై సమాచారమిచ్చినా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

\- నూజివీడు

నూజివీడు పట్టణం నలుమూలల్లోనూ, శివారు ప్రాంతాల్లోని మామిడితోటలు, జనసంచారం లేని ప్రాంతాల్లో ప్రతి రోజూ సాయంత్రం యువత గంజాయి సేవిస్తున్నారు. గతంలో గంజాయి అమ్మకాలను 40, 50 ఏళ్ల పైబడిన వ్యక్తులు చేసేవారు. ఇప్పుడు గంజాయి అమ్మకందారులు, కొనుగోలుదారులు యువకులే కావడం విశేషం. పట్టణంలో బాపూనగర్, నెహ్రూపేట, అమెరికన్ ఆసుపత్రి సెంటర్, ఎమ్మార్ అప్పారావు కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, ఆర్‌ఆర్ పేట, గాంధీనగర్ ప్రాంతాల్లో గంజాయి వినియోగం ఎక్కువగా ఉందని సమాచారం. ఇప్పటివరకు గంజాయి అమ్మకాల్లో వైసీపీకి చెందిన స్థానిక యువ నాయకులు పాత్ర ఉందనే ప్రచారం సర్వత్రా వినిపిస్తోంది. ముఖ్యంగా మధ్యతరగతి, దిగువ తరగతి యువత ఈ వ్యసనానికి బానిసలై చివరకు గంజాయి కొనుగోలుకు దొంగతనాలకు దిగుతున్నారు. బాపూనగర్‌లో చాలామంది తమ ఇంటి బయట పెట్టిన ద్విచక్రవాహనాల్లో రాత్రివేళ పెట్రోల్ దొంగతనాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇది గంజాయి తాగేందుకు అలవాటు పడినవారి పనే అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.


నూజివీడులో పట్టుబడిన గంజాయి, మత్తు ఇంజక్షన్లు (ఫైల్)


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గంజాయి తేనందుకు దాడికి గురైన యువకుడు(ఫైల్)

యువత బానిస

గత ఐదేళ్లుగా నూజివీడులో గంజాయికి అధిక సంఖ్యలో యువత బానిసలయ్యారు. దీనికి ప్రధాన కారణం మార్కెట్లో యథేచ్ఛగా గంజాయి దొరకడమే. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కొంతమంది యువకులు నూజివీడులో మకాం వేసి, ఊరు శివారులో సిగిరెట్ తాగే యువతను టార్గెట్ చేసి వారితో పరిచయం పెంచుకుని వారికి తొలుత కొద్ది మొత్తంలో గంజాయిని ఉచితంగా ఇచ్చి వారిని మత్తుకు అలవాటు చేశారు. ఈ మత్తుకు అలవాటు పడిన యువకుల నుంచి తరువాత డబ్బులు వసూలు చేసేవారు. ఇంజినీరింగ్ విద్యను సైతం అభ్యసిస్తున్న కొంతమంది బానిసలై చివరకు గంజాయి కొనటానికి సొమ్ము లేక వారు గంజాయి అమ్మకాలకు దిగినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వారు రెండుసార్లు పట్టుబడి జైలుకు వెళ్లి తమ విద్యను పాడుచేసుకున్న ఘటనలు నూజివీడులో జరిగాయి.

నిద్ర మత్తులో పోలీసులు

గంజాయి అమ్మకాలపై పోలీసుల వద్ద పూర్తిసమాచారం ఉన్నప్పటికీ పోలీసులు నిద్రమత్తులో జోగుతున్నారనే ప్రచారం ఉంది. మైనర్ల భవిష్యత్తు దృష్ట్యా వారిమీద కేసులు నమోదు చేయకున్నా, వారి ద్వారా అమ్మకం దారులను పట్టుకుని కేసులు నమోదుచేసి అమ్మకాలను అరికట్టవచ్చు. కానీ పోలీసులు ఆ పని చేయడం లేదు. నూజివీడుకు చెందిన యువ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఆ వైద్యుడు స్పందనలో ఫిర్యాదు చేసినా న్యాయం జరగకపోవడంతో ఇటీవల సదరు వైద్యుడు సామాజిక బాధ్యత దృష్ట్యా కోర్టులో ప్రైవేట్ కేసు వేయడంతో కోర్టు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేయమని పోలీసులను ఆదేశించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కేసు నమోదైనా చర్యలు నిల్

కోర్టు జోక్యంతో పోలీసులు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినా ఇంతవరకు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇది దేనికి సంకేతమో పోలీసులే చెప్పాలని నూజివీడు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. వైసీపీ ప్రభుత్వం మారి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇటీవల ఏలూరు జిల్లాకు నూతన ఎస్పీగా కొమ్మి ప్రతాప్ శివకిశోర్ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ప్రాధాన్యత దృష్ట్యా గంజాయిని అరికట్టడంపై దృష్టి సారించి ఉక్కుపాదం మోపి యువత భవిష్యత్తును కాపాడేలా నూజివీడు పోలీసులు నిద్రమత్తు వదిలేస్తారని ఈ ప్రాంత ప్రజలు ఆశాభావంతో ఉన్నారు.



శాకంబరి అలంకరణలో సోమేశ్వర స్వామి, పార్వతి, అన్నపూర్ణాదేవి

సోమేశ్వరస్వామి, అమ్మవార్లకు శాకంబరి అలంకారం

భీమవరం టౌన్, జూలై 22 : ఆషాఢం సందర్భంగా సోమవారం గునుపూడిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో సోమేశ్వరస్వామి, పార్వతీదేవి, అన్నపూర్ణదేవి అమ్మవార్లను శాకంబరిలుగా అలంకారం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

శాకంబరిగా లలితా దేవి

అత్తిలి, జూలై 22 : అత్తిలి ఆంజనేయస్వామి ఆలయంలోని లలితా దేవి మందిరంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. లలిత భక్త సమాజం లలితా పారాయణం చేసింది. ఆలయ అర్చకుడు చేబోలు భీమేష్, పమ్మి గోపాలకృష్ణ మూర్తి పాల్గొన్నారు. .

బధిర విద్యార్థులను ప్రోత్సహించాలి

భీమవరం అర్బన్, జూలై 22: బధిర విద్యార్థులను ప్రోత్సహించాలని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. సంస్థ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని భీమవరం వెంకటేశ్వర బధిర పాఠశాల విద్యార్థులకు స్వీట్లు, పండ్లు, పుస్తకాలు, మొక్కలు అందించారు.

నేడు చిన్నపిల్లల ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం అర్బన్, జూలై 22 : అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం మెంటేవారితోటలో నేడు మంగళవారం చిన్నారులకు ఉచిత గుండె వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వసుధ పౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన చిన్నపిల్లల గుండె వైద్య నిపుణులు డా. విక్రమ్ 15ఏళ్ల లోపు చిన్నారులకు ఉచిత 2డీఇకో పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. భీమవరం పరిసర ప్రాంతల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోటరీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



పాలకొల్లు రూరల్, జూలై 22 : రోటరీ క్లబ్ ఆఫ్ గోదావరి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం లయన్స్ కమ్యూనిటీ హాల్లో చేగొండి సూర్యప్రకాశ్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా రోటరీ డీజీఈ కళ్యాణ చక్రవర్తి హాజరై నూతన కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్ ప్రత్యేక ఆహ్వానితునిగా విచ్చేశారు. నూతన అధ్యక్షుడిగా కాలనాధభట్ల సుధీర్, కార్యదర్శిగా ఇనుకొండ శేషాద్రి, కోశాధికారిగా పి కీర్తిచంద్ రాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. సోమంచి శ్రీనివాస శాస్త్రి, రావూరి అప్పారావు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

మంత్రి దృష్టికి మంచినీటి సమస్య

పోడూరు, జూలై 22: వేడంగి వాటర్ ప్రాజెక్ట్ నుంచి గ్రామాలకు అందించే మంచినీరు ఫిల్టర్ అవ్వడం లేదని గ్రామసర్పంచ్ చెల్లబోయిన పద్మపార్వతి శారద సోమవారం రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి నిమ్మల స్పందించి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో సోమవారం మధ్యాహ్నం ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాసరావు జేఈ బుజ్జేశ్వరరావు వాటర్ ప్రాజెక్ట్ వద్దకు వచ్చి పరిశీలించారు. వాటర్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మైక్రో ఫిల్టర్ బెడ్లు మరమ్మతులు కారణంగా మంచినీరు శుద్ధి అవ్వటం లేదని గుర్తించారు. అక్కడ నుంచి ఆయన ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లారు. 10రోజుల్లో సమస్యను పరిష్కరించేదిశగా మైక్రో ఫిల్టర్ బెడ్లు మరమ్మతులు చేపడతామని మంత్రి రామానాయుడుకి వివరించారు.

డిగ్రీలో చేరేందుకు 25వ తేదీ వరకు గడువు

పాలకొల్లు అర్బన్, జూలై 22 : స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ టి రాజ రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునన్నారు. తమ కళాశాలో 9సింగిల్ మేజర్ సెబ్జెక్టు కోర్సులు ఉన్నాయని, బీ కామ్ (జనరల్) బీకామ్ (కంప్యూటర్ అప్లికేషన్లు) బీఏ (ఎకనామిక్స్), బీఏ (పొలిటికల్ సైన్స్), బీఎస్సీ (మ్యాథ్స్), బీఎస్సీ (కెమిస్ట్రీ), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (బోటనీ), బీఎస్సీ (జువాలజీ)లు తమ కళాశాలలో అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యార్థులకు ఫీజుల భారం

పాలకొల్లు అర్బన్, జూలై 22: దేశంలో విద్యా ప్రమాణాలకన్నా ఫీజులు పెనుభారంగా మారుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవానీ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐఐటీల్లో 15ఏళ్ళలో ఏడు రెట్లు ఫీజులు పెంచడం జరిగిందని, ప్రభుత్వం ప్రకటించిన ఫీజుల కన్నా వివిధ రకాల పేరుతో ప్రైవేటు యాజమాన్యాలు అదనంగా వసూలు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఫీజుల భారం తగ్గించాలని ప్రభుత్వాలను కోరారు.

యూబీఐ రిటైల్ ఎక్స్‌పో ప్రారంభం

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 22: యూనియన్ బ్యాంక్ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ ఏలూరు రీజనల్ అధికారి నాంపల్లి శ్రీనివాస అన్నారు. పట్టణంలోని యూనియన్ బ్యాంక్‌లో నిర్వహించిన రిటైల్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆర్ఎల్‌పీ అధికారి బీ.హనుమంతురావు, పట్టణ బ్రాంచ్ మేనేజర్‌లు పదీప్‌మల్లిక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముంపు బాధితులకు ఆహారం పంపిణీ



భీమవరం అర్బన్, జూలై 22 : పట్టణంలోని ఒకటి రెండు వార్డుల్లో వరదల వల్ల నిరాశ్రయులైన 300 పేద కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి సౌజన్యంతో, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మెంటే గోపి, మద్దుల రాము, గంటా త్రిమూర్తులు, తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్య రాజు, ఎద్దు ఏసుపాదం, తోట సురేష్, బాతు నరేష్ చేతుల మీదుగా ఆహార పంపిణీ చేశారు.

మురుగు తొలగింపు



ఇరగవరం, జూలై 22 : ఎడతెరిపి లేని వర్షాలకు మండలంలోని రేలంగి సంతమార్కెట్ వద్ద రహదారులు జలమయం కావడంతో ప్రజలు ఇళ్ళ నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీటిని బయటకు పంపేందుకు కూటమి నాయకులు సోమవారం పంచాయతీ సిబ్బందితో చర్యలు చేపట్టారు. దీంతో పలువురు కూటమి నాయకులను అభినందించారు.

గుంతలతో ప్రయాణం నరకం



వర్షాలకు ఇరగవరం - ఏలేటిపాడు రహదారి దుస్థితి

ఇరగవరం, జూలై 22 : రహదారుల అభివృద్ధిపై గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ప్రజల ప్రాణాల మీదకి తెస్తోంది. ఇరగవరం-ఏలేటిపాడు రహదారి గోతులతో అధ్వానంగా తయారైంది. ఆ గోతుల్లో వర్షపునీరు నిండిపోవడంతో గొయ్యి ఎంత లోతుందో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేస్తున్నారు. దీనికి తోడు ఆ రహదారిపై వెళ్తుంటే వాహనాలు చెడిపోతూ ఒళ్ళు హూనం అవుతోందని, కనీసం గోతులనైనా పూడ్చి ప్రాణాలు కాపాడాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

వీడని ముంపు.. నీటిని లాగని డ్రెయిన్లు

నానుతున్న వరి పొలాలు.. నష్టాన్ని తగ్గించేందుకు రైతుల అష్టకష్టాలు



ఆచంటలో పడవపై అయోధ్యలంక వెళుతున్న తహసీల్దార్, ఎంపీడీవో

ఆచంట, జూలై 22: భారీ వర్షాలు కారణంగా మండలంలో నేటికి పంట పొలాలు ఇంకా చెరువులను తలపిస్తూనే ఉన్నాయి. మండలంలో పది వేల 200 ఎకరాలకు గాను 1300 ఎకరాల్లో వరి నాట్లు 160 ఎకరాల్లో నారుమడులు నీట మునిగాయి. వర్షాలు తగ్గినప్పటికి ముంపులోనే పొలాలు ఉండటంతో సుమారు 500 ఎకరాల్లో వరినాట్లు 80 ఎకరాలకు సంబంధించి నారుమడులు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

- గోదావరి ఉధృతి రోజు రోజుకు పెరుగుతున్న కారణంగా లంక గ్రామాల వాసులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఐవీశెట్టి, ఎంపీడీవో పి.నరసింహ ప్రసాద్ అన్నారు. సోమవారం తహసీల్దార్, ఎంపీడీవోలు పడవపై అయోధ్యలంక వెళ్లి స్థానికులతో మాట్లాడారు. వరద పెరుగుతున్న కారణంగా లంక ప్రజలు అధికారులకు సహకరించాలని సూచించారు. లంక గ్రామాల్లో విద్యుత్ సరఫరా కూడా నిరంతరం ఉండేలా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

చెరువులను తలపిస్తున్న వరిచేలు

పాలకోడేరు, జూలై 22: మోగల్లు శివారు గుత్తుల వారిపాలెం వద్ద గోస్తనినదికి గండిపడటంతో ఆ ప్రాంతంలోని పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఆదివారం రాత్రి గోస్తని నది ఉధృతికి గట్టు సుమారు నాలుగుమీటర్ల తెగిపడి ఆ ప్రాంతంలోని పొలాలను వరదనీటితో ముంచెత్తాయి. దీంతో స్థానికులు రాత్రికి రాత్రే హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని గండిని కట్టడి చేసే ప్రయత్నం చేసినప్పటికి ఆ వేగాన్ని ఎవరూ అడ్డుకోలేకపోయారు. దీంతో ఆ ప్రాంతంలోని పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అధికారులు, సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం గండిని కట్టడి చేశారు. దీంతో గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు.

ఉండి పంట కాల్వకు కోత

ఉండి జూలై 22: సాగపాడు వద్ద ఉండి పంట కాలువ కోతకు గురైంది. దీనితో వరదనీరు యండగండిలోని రామరాజుపురం, తిమ్మరాజుకాలనీ, జగన్ననకాలనీ, గొల్లలవీధిల గుండా యండగండి గ్రామాన్ని చుట్టుముట్టింది. దీనిని ఆనుకుని వున్న వరిచేలు, ఆక్వాచెరువులు ముంపుబారినపడ్డాయి. యండగండి దళితపేటలోని ఆశీర్వదం ఇంటిలోకి వరదనీరు చేరింది. మాజీ ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు స్వగ్రామమైన యండగండికి వరదనీరు ముంచుకొచ్చి ంది. దాంతో ఆయన ఇంటిని వరదనీరు చుట్టుముట్టిం ది. ఇంటిలోపల ఆవరణంతా వరదనీరుతో నిండిపోయి ంది. పొలాలు మునిగిపోవడంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముంపులో పిప్పర

గణపవరం, జూలై 22 : యనమదుర్రు డ్రెయిన్ పొంగి ప్రవహిస్తోంది. దీంతో పిప్పరలోని సబ్‌స్టేషన్ ప్రాంతం, రహదారులు నీటమునగగా, కొన్ని ఇళ్లు ముంపుబారిన పడ్డాయి. బాధిత కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ముంపునీటిని ఇంజన్లతో తోడుతూనే ఉన్నారు. ఎస్.కొండేపాడు, కేశవరం, పిప్పర, కోముట్లపాలెం, మొయ్యేరు, కోమర్రు, ఆయుకట్టులోని సుమారు నాలుగు వేల ఎకరాలు మూడు రోజుల నుంచి ముంపులోనే ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆయుకట్టులోని ముంపు నీరు బయటకు వెళ్ళాలంటే యనమదుర్రు వరద ఉధృతి తగ్గి, నీటిమట్టం తగ్గితేనే ముంపు భారీ నుంచి వరి పైరును కాపాడుకోవచ్చని రైతులు చెబుతున్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ గణపతిరావు, తహసీల్దార్ వై.రాంబాబు, ఎంపీడీఓ సూర్యనారాయణ, గణపవరం మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, ఉంగుటూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో సోమవారం సర్వే నిర్వహించారు.

వరదపై కలెక్టర్ సమీక్ష

భీమవరం టౌన్, జూలై 22 : గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో వరద పరిస్థితిపై సమీక్షించారు. భద్రాచలం నుంచి దిగువకు వదులుతున్న వరద నీటితో వశిష్ట గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. వరద సాధారణ స్థాయికి వచ్చేవరకు రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్యం, ఫైర్ తదితర శాఖల అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తుండాలి. బోట్లు, గజ ఈత గాళ్లు, లైఫ్ జాకెట్లు సిద్ధంగా ఉంచాలి' అని ఆదేశించారు. కనకాయలంకలో నాలుగు బోట్లను, గజ ఈతగాళ్లను ఇప్పటికే సిద్ధంగా సిద్ధంగా ఉంచినట్టు అగ్నిమాపక అధికారి తెలిపారు. పాము, కుక్క, తేలు కాటుకు మందులు అందుబాటులో ఉన్నా యని డీఎంహెచ్‌వో తెలిపారు. డీఆర్‌వో జె.ఉదయభాస్కర రావు, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శివన్నారాయణరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ శాఖ ఈఈ దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ప్రభుత్వం అండ

పాలకోడేరు, జూలై 22: మునకకు గురైన బాధితులకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని కలెక్టర్ నాగరాణి అన్నారు. మోగల్లు శివారు గుత్తుల వారిపాలెంలో ఆదివారం రాత్రి గోస్తనినదికి పడిన గండి ప్రాంతాన్ని, ఆ ప్రాంతంలో మునకకు గురవుతున్న ప్రాంతాన్ని కలెక్టర్ ఆదివారం అర్థరాత్రితోపాటు సోమవారం ఉదయం కూడా ఆ ప్రాంతాన్ని పరిశీలించి బాధితులకు ధైర్యం చెప్పారు. కలెక్టర్ నాగరాణి బాధి తులతో మాట్లాడుతూ గండిపడిన ప్రాంతాన్ని కట్టడి చేసేందుకు యుద్ధప్రతిపాదికన పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని వారిని ప్రశ్నించారు. తమకు డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేదని, తాగునీటికి ఇబ్బందులుపడుతున్నామని చెప్పడంతో ఆమె మండలాధికారులకు తాగునీటితో పాటు రేషన్‌ను సక్రమంగా అందేలా చూడాలని తెలిపారు. ముంపు ప్రాంతాల్లో పాములు తిరిగే ప్రమాదం ఉందని వైద్య సిబ్బంది అందుకు తగిన మందులు సిద్ధం చేసుకోవాలని కోరారు. ఆర్డీవో శ్రీనివాసులురాజు, ఎంపీడీవో అనూహ్య, సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి పాల్గొన్నారు.

మొగల్తూరులో మునిగిన ఆకుమడులు

మొగల్తూరు, జూలై 22: మండలంలో సార్వా సాగుకు వేసిన నారుమడులు పూర్తిగా నీటమునిగాయి. ముందుగా నాట్లు వేసిన చేలు కూడా కాలువలను తలపిస్తున్నాయి. మొగల్తూరు పంచాయతీ ఇంజేటివారి పాలెం, నక్కావారిపాలెం, కోట, పాలకమ్మ చెరువు, రామన్నపాలెం అడవిపర్రలలో సోమవారం మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ సిబ్బంది ముంపు చేల ప్రాంతాల్లో పర్యటించి రైతులతో సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా మండలంలోని యనమదుర్రు, మాగలేరు, గునిపూడి, దర్భరేవు గొందేరు డ్రెయిన్‌లు పొంగి పొర్లుతున్నాయి.

ముంపునీటిలోనే రామేశ్వరుడు

పెనుమంట్ర, జూలై 22: అధిక వర్షాలు కారణంగా గోస్తనీ పొంగి ప్రవహించటంతో నదికి ఆనుకుని ఉన్న నత్తారామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి గర్భాలయంలోకి నీరుచేరిపోయింది. నీటిలోనే ఆలయ అర్చకులు వెళ్ళి పూజలు చేస్తున్నారు. అదే విధంగా అమ్మవారి ఆలయంలోకి కూడా నీరుచేరిపోయింది.

పొంగిన యనమదుర్రు

అత్తిలి, జూలై 22 : యనమదుర్రు డ్రెయిన్ పొంగి ప్రవహించడంతో దువ్వ దిగువ గ్రామాలైన వరిగేడు, గుమ్మంపాడు, బల్లిపాడు, తిరుపతిపురం గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఊడ్చిన వరి చేలు నీట మునిగాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. తిరుపతిపురం నుంచి వరి చేలు సముద్రాన్ని తలపించేలా నీటితో నిండి ఉన్నాయి. తిరుపతిపురం-బి. కొండేపాడు రహదారి నీటమునిగి పోయింది.

175 ఎకరాల్లో పంట నష్టం

నరసాపురం రూరల్, జూలై 22: సబ్‌డివిజన్ పరిధిలోని మూడు మండలాల్లో 175 ఎకరాల వరకు పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచన వేసినట్లు వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి తెలిపారు. నరసాపురంలో 52, యలమంచిలి 74, మొగల్తూరు 49 ఎకరాల వరకు పంట దెబ్బతిందన్నారు. ఈ మూడు మండలాల్లో 482 ఎకరాల నారుమడి వేస్తే 208 ఎకరాల వరకు నీట మునిగిందన్నారు. 264 ఎకరాల ఊడ్పులు వేస్తే 175 ఎకరాల వరకు పంట దెబ్బతిందని ఏఈడీ చెప్పారు. చేనులో వర్షం నీరు తగ్గిన తరువాత రైతులు ఏకరానికి 15కేజీల యూరియా, 20 కేజీల పొటాష్, అర కిలో కార్బడిజం మ్యాంకోజబ్ మందులు వేసి పిచికారి చేయాలన్నారు. దీని వల్ల ఆకుమడులకు తెగుళ్లు పట్టవన్నారు.

భీమవరంలో టీడీపీ నేతల పర్యటన

భీమవరం అర్బన్, జూలై 22: భీమవరం నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాల కారణంగా నీట మునిగిన పంట పొలాలు, కాలనీలను సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు పరిశీలించారు. ముంపు ప్రాంతాలలోని ప్రజలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు చెన్నమల చంద్రశేఖర్, ముచ్చకర్ల సుబ్బారావు, ఎద్దు ఏసుపాదం, అనపర్తి కృష్ణ, గోపి, గంటా త్రిమూర్తులు, తోట సురేష్ పాల్గొన్నారు.

వైసీపీ వల్లే రైతులకు వెతలు: బాబ్జి

పెంటపాడు, జూలై 22: వైసీపీ అనాలోచిత చర్యల వల్లే నేడు రైతులు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. సోమవారం వర్షాల కారణంగా ముంపునకు గురైన పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడుతూ మంత్రి రామానాయుడు దృష్టికి సమస్యలు తీసుకువెళ్ళి రైతులకు ఇబ్బందులేకుండా చూస్తామని, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అసెంబ్లీ సమావేశాల్లోను రైతుల సమస్యను ప్రస్తావిస్తారన్నారు. గంధం సతీష్, పాతూరి రాంప్రసాద్ చౌదరి, పుల్లా బాబి, పసల అచ్యుతం, పీతల సత్యనారాయణ, సర్పంచ్ కోటేశ్వరరావు, అచ్యుత సత్యనారాయణ, తహసీల్దార్ సురేష్‌బాబు, ఏవో పార్థసారథి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం రూరల్, జూలై 22: రానున్న రోజుల్లో గోదావరికి వరద పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నాయకర్ కోరారు. సోమవారం ఏటిగట్టు శాఖ, ఇతర సిబ్బందితో కలిసి గోదావరి గట్టును పరిశీలించారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. పొన్నపల్లి, కొండాలమ్మ, వీచుపాలెం ప్రాంతాల్లో వరద నీరు చేరే అవకాశం ఉన్నందున అధికారులు ముందుస్తు చర్యలు చేపట్టాలన్నారు. మోటార్లతో నీటిని తోడాలన్నారు. శానిటేషన్ సమస్య తలెత్తకూడదన్నారు. ముంపు ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్డీవో అంబరీష్ కూడా వరద ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన వెంట కమిషనర్ వెంకటేశ్వరావు, ఏఈ సుబ్బారావు, దొండపాటి స్వామి, పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో అధికారుల పర్యటన

పెనుగొండ, జూలై 22: సిద్ధాంతం వద్ద తహసీల్దార్, ఎంపీడీవోలు వరద ఉధృతిని పరిశీలించారు. లంకలోని అరటి తోటలు, కూరగాయల పంటలు నీట మునిగాయి. గోదావరి పెరిగే అవకాశం ఉన్నదని, పరీవాహక ప్రాంతవాసులందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వరద నేపథ్యంలో నాటు పడవలపై ప్రయాణాలను నిషేధించారు. సిద్దాంతం పుష్కర ఘాట్‌వద్ద పోలీసు పికెట్‌ను ఏర్పాటు చేశారు.



గణపవరంలో ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న అధికారులు



ఇంజేటివారిపాలెంలో మునిగిన ఆకుమడుల వద్ద రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో రహీం



భీమవరంలో ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు



పరిమెళ్ళలో వర్షానికి పాడైన నారును పరిశీలిస్తున్న వలవల బాబ్జి



యండగండిలో మాజీ ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ఇంటిని చుట్టుముట్టిన వరద నీరు

వరద ప్రాంతాల్లో జేసీ పర్యటన

యలమంచిలి (పాలకొల్లు రూరల్), జూలై 22 : లంక గ్రామాల ప్రజలు అప్రమక్తంగా ఉండాలని, అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో మకాం ఉండి వరద పరిస్థితిపై తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య అన్నారు. కనకాయలంక గోదావరి నదిలోని కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న వరదను జేసీ ప్రవీణ్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. పెదలంక, దొడ్డిపట్ల, అబ్బిరాజు పాలెం, గంగడి పాలెం, లక్ష్మీపాలెం, గ్రామాల్లో జేసీ పర్యటించారు.

జాతీయ జెండాకు వందనం



పాలకొల్లు అర్బన్, జూలై 22 : జాతీయ జెండా స్వీకరణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక బీఆర్ఎంవీఎం హైస్కూల్లో జరుగుతున్న టీచ్ టూల్ ప్రోగ్రాంలో పాల్గొన్న ఉపాధ్యాయులు జాతీయ జెండాకు వందనం చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో జీ వీరాస్వామి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఏఎంవో ఎ రామకోటేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ జెండా దత్తత దినోత్సవాన్ని ప్రతీ ఏటా జూలై 22వ తేదీన జరుపుకుంటామని తెలిపారు.

కాలినడకన తిరుపతి వెళ్లి వచ్చిన భక్తుడు



పెనుగొండ, జూలై 22: సిద్దాంతం గ్రామానికి చెందిన ఒక భక్తుడు తిరుపతికి కాలినడకన వెళ్ళి స్వామి వారిని దర్శించుకుని సోమవారం తన స్వగృహానికి చేరుకున్నారు. గత నెల 26న సిద్దాంతం నుంచి సుతాపల్లి వీర వెంకట సత్యనారాయణ ఒంటరిగా కాలినడకన పెద్ద తిరుపతికి ప్రయాణమయ్యాడు. నరసాపురం, మచిలీపట్నం, చీరాల, ఒంగోలు, నెల్లూరు, వెంకటగిరి మీదుగా సుమారుగా 600 కిలో మీటర్లు ప్రయాణించి తొలి ఏకాదశి రోజున శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడి నుంచి బస్సులో ప్రయాణించి అరుణాచలేశ్వర స్వామి ప్రదక్షిణ మూడుసార్లు చేశానని సత్యనారాయణ తన అనుభవాలను తెలిపారు.

కళాకారులకు అండగా ఉంటాం : వలవల

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 22: కూటమి ప్రభుత్వం కళాకారులకు అండగా ఉంటుందని టీడీపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి హామీ ఇచ్చారు. తాడేపల్లిగూడెంలో ఆదివారం రాత్రి బీవీఆర్ కళా కేంద్రం ఆధ్వర్యంలో వాసవి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణకు నిర్వహించిన పౌర సత్కార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాకేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు, వాసవి ఇంజనీరింగ్ కళాశాల కోశాధికారి పేరూరి బాల కాశియ్య, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నీటి మడుగులా జడ్పీ గ్రౌండ్



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 22: ఎడతెరిపి లేని వర్షాలకు పల్లపు ప్రాంతాలు చెరువులను తలపిస్తుంటే తాడేపల్లిగూడెం నడిబొడ్డున ఉన్న జడ్పీ పాఠశాల ప్రాంగణం సంద్రంలా మారింది. ఒక పక్క జడ్పీ ఉన్నత పాఠశాల, మరో పక్క జూనియర్ కళాశాలకు మధ్య ఉండే ఈ క్రీడా ప్రాంగణం నీటితో నిండింది.

దళితులపై దాడులు అరికట్టాలి

పాలకోడేరు, జూలై 22: దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని దళిత నాయకులు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ మెంబర్ పొన్నమండ బాలకృష్ణ, కోరం ముసలయ్యలు సోమవారం ఎస్పీని కలుసుకుని విన్నవించారు.

బీజేపీని మరింత బలోపేతం చేద్దాం

నరసాపురం టౌన్, జూలై 22: నియోజక వర్గంలో బీజేపీని మరి ంత బలోపేతం చేసేందు కు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ పిలుపునిచ్చారు. పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ప్రముఖ సహస్ర అవధాని కడిమెళ్ళను ఘనంగా సత్కరించారు.

ఎంపీడీవో కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా



ఎంపీడీవో కుటుంబ సభ్యుల్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొమ్మిడి, పొత్తూరి

నరసాపురం, జూలై 22: అదృశ్యమైన ఎంపీడీవో వెంకటరమణ కుటుంబ సభ్యుల్ని సోమవారం ఎమ్మెల్యే నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు విజయవాడలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన భార్య ఫోన్‌కాల్స్ గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కాల్స్ వచ్చినప్పుడల్లా భయపడేవారని, అప్పుచేసి డబ్బు కూడా వారికి పంపినట్లు తెలియజేశారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ మీకుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆచూకి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నామని ఎమ్మెల్యే తెలియజేశారు.

న్యాయవాదుల ఎన్నికలకు 28 నామినేషన్లు

నరసాపురం, జూలై 22: ఈనెల 31న జరిగే న్యాయవాదుల సంఘం ఎన్నికలకు సోమవారం నాటికి 28 నామినేషన్లు దాఖలయ్యాయి. సంఘంలోని అధ్యక్ష, కార్యదర్శులతో పాటు 15 మంది సభ్యులకు నామినేషన్లు స్వీకరిస్తున్నారు. అధ్యక్ష పదవికి మోహన్‌బాలాజీ, వల్లభరావు, ఉపాధ్యక్ష పదవికి కొత్తపల్లి రమేష్, మాణిక్యాలరావు, ప్రధాన కార్యదర్శికి వైదాని నాగేశ్వరరావు, పుల్లాజీ, ఆర్ కుమార్, కోశాధికారి పదవికి పురేళ్ళ శ్రీనివాస్, లైబ్రరీ పదవికి అమరేశ్వరావు, పుల్లాజీలు నామినేషన్లు వేశారు. వీటితోపాటు కార్యదర్శి పదవికి కూడా ఎక్కువ నామినేషన్లు పడ్డాయి. ఎన్నికల అధికారిగా నల్లిమిల్లి జోసఫ్ వ్యవహరిస్తున్నారు.

పరిమి పుట్టినరోజు వేడుకలు



వెంకన్నబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

తణుకు, జూలై 22: తణుకు మున్సిపల్ మాజీ చైర్మన్ పరిమి వెంకటేశ్వరరావు (వెంకన్న బాబు) జన్మదిన వేడుకలు సోమవారం పరిమి టవర్సులో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. నియోజకవర్గం నుంచి టీడీపీ శ్రేణులు, అభిమానులు విచ్చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, బసవా రామకృష్ణ, కలగర వెంకటకృష్ణ, సప్పా రాజు, సీహెచ్. సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ సమస్యలు పరిష్కరించాలి



ఆకివీడు, జూలై 22 : ముంపు ప్రజల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం డిమాండ్ చేసింది. సోమవారం నగర పంచాయతీ కార్యాలయం దగ్గర జగనన్న కాలనీ వాసులతో సీపీఎం నేతలు కలిసి ధర్నా నిర్వహించి కమిషనర్ కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందించారు. తాళ్ళకోడులోని జగనన్న కాలనీ వర్షాలకు ముంపుబారిన పడినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ సదుపాయాలు లేవన్నారు. వీధిలైట్లు సుమారు పది రోజుల నుంచి వెలగడం లేదన్నారు.

అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యే రఘురామ



ఉండి జూలై 22:ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. తొలుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అసెంబ్లీ హాలుకు వెళ్లిన కనుమూరు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని చూసి ఆయన వద్దకు వెళ్లి షేక్‌హ్యాండ్ ఇచ్చారు.

రైతులను ఆదుకోవాలి: ఎమ్మెల్యే ఆరిమిల్లి



తణుకు, జూలై 22: వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్థక శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును సోమవారం ఆయన చాంబర్‌లో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కలసి విన్నవించారు. అలాగే రహదారులు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలసి నియోజకవర్గంలోని రహదారులను అభివృద్ధి చేయాలని కోరారు. చంద్రబాబుతో కలసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి అసెంబ్లీ సమావేశంలో పాల్గొన్నట్లు ఆయన చెప్పారు.

స్పీకర్‌ను కలిసిన అంగర



పాలకొల్లు అర్బన్, జూలై 22: అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం సందర్భంగా శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడును ఆయన ఛాంబర్‌లో సోమవారం కలిసి పలు అంశాలపై చర్చలు జరిపినట్టు మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ తెలిపారు. అలాగే ఎమ్మెల్యేలు రామారావు, ఆరిమిల్లి రాధాకృష్ణ, బడేటి చంటి, జీవీ ఆంజనేయులుతో కలిసి ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రను కలిసి ఎక్సైజ్ పాలసీలో గీత కార్మికులకు రిజర్వేషన్ కల్పించే విషయం చర్చించినట్టు అంగర తెలిపారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 22: ఆధార్ అప్డేట్‌కు సంబంధించి పట్టణంలోని 2, 11, 15, 18, 23 వార్డు సచివాలయాల్లో ఈ నెల 23 నుంచి 27 వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.